
నల్లని మబ్బులు కమ్ముకువస్తున్నాయి. హోరుగాలి కూడా హఠాత్తుగా మొదలైంది. "ఓరే ఆదిత్యా, వాన వచ్చేటట్టు ఉంది ఆట మానేసి ఇంటికి పోదాం" అన్నాడు చైతన్య.

గోలీలు జేబులో పడేసుకుని ఇళ్ళ దారి పట్టాం. మధ్యలో జామకాయలు కనిపిస్తే పదేసిపైసలు పెట్టి రెండు చిన్న చిన్న కాయలు కొని తింటూ ఇల్లు చేరాం. దారిలోనే వాన మొదలైంది.

# తుఫాను

కె. పార్థసారథి



"ఏరా తడిశావా? అదిగో! మళ్ళీ ఆ పచ్చి జామకాయలు తింటున్నావా? కడుపు నొప్పెడుతుంది రా వెధవా చెబితే వినవ్!"

అమ్మ దండకం ప్రారంభించింది. నేను లోపలికి వెళ్ళి తువ్వాలుతో తల తుడుచుకుని, హోమ్‌వర్క్ పుస్తకాలు ముందర వేసుకుని కూర్చున్నాను. అప్పటికే నాన్న పడక కుర్చీలో కూర్చుని, వెనక్కి జారగిలబడి విశ్రాంతి తీసుకుంటున్నారు. తలుపులు గాలికి కొట్టుకుంటున్నాయి.

"ఆ కిటికీ తలుపులు వేసిరా కల్యాణీ" అఅకిన్నారు నాన్నగారు.

అక్క తలుపులూ, కిటికీలూ మూసివచ్చి లెక్కల పుస్తకం ముందేసుకు కూర్చుంది. "నాన్నా, బంగాళాఖాతంలో డిప్రెషనట నానా. తుపాను వస్తుందేమో!" అంది అక్క.

"తుపానే! అమ్మో" అంది అమ్మ భయంగా లోపల వంటింట్లో నుంచి. రెండేళ్ళ క్రితం తుపానుకి మా ఇంటి ముందు కొబ్బరి చెట్టి కూలి, మా ఇంటి పై కప్పుకి కన్నం పడింది. ఇంట్లోకి నీరు వచ్చేసి సామానంతా పాడైంది.

"మనకి భయమని తుపానులు రాకుండా మానుతాయా? ఏదీ మనకోసం ఆగదు" అన్నారు నాన్న వైరాగ్యంగా.

ఇంతలో బయట వర్షం ఎక్కువైంది. "రామం, రామం" అని పిలుస్తూ వీధి తలుపు గట్టిగా కొడుతున్న శబ్దం. "నాన్నా, ఎవరో మిమ్మల్నే పిలుస్తున్నారు" అన్నాను.

మూల ఉన్న గొడుగు వేసుకొని నాన్న వెళ్ళి వీధిగుమ్మం తలుపు తీశారు. "ఓరే రామం, వున్నావట్రా. హమ్మయ్య. ఇదిగో కామాక్షీ, మీరు రిక్షా దిగండి మా రామం వున్నాడు" అంటూ వచ్చినాయన గట్టిగా కేక వేశారు.

అప్పటికే నేనూ, అక్క ముందు వరండాలోకి వచ్చి నుంచున్నాం. ఈ సందడికి అమ్మ వంటింట్లోంచి వచ్చింది.

"ఓ రారా! శివుడూ!!" అన్నారు నాన్న. వెంటనే ఒక పెద్ద మనిషీ, ఆయన వెనక ఓ ఆంటీ, ఒక యువకుడు ఇంట్లోకి ప్రవేశించారు.

"ఆదిత్యా, అత్త చేతిలో బుట్ట అందుకో" అన్నారు నాన్న. నేను ముందుకు వెళ్లి ప్లాస్టిక్ బుట్ట తీసుకున్నాను.

"అమ్మయ్య! నువ్వు లేకపోతే ఈ వర్షంలో ఏమై పోదుమో!" అంటూ శివుడుగారు సూట్ కేస్ క్రింద పెట్టి కుర్చీలో ఆశీనులయ్యారు.

"ఇదిగో సీతా, చెల్లెమ్మని ఇంట్లోకి తీసుకెళ్ళు" నాన్న పిలిచారు.

"రండి, వదినగారూ" అంటూ అమ్మ ఆవిడని ఆహ్వానించింది.

"ఏవమ్మా, సీతమ్మా, నేనెవరో గుర్తున్నానా! మీ ఆయనా, నేనూ చిన్నప్పటి నుంచీ, అంటే లాగుల టైము నుంచి, ఇంటరు దాకా క్లాస్ మేట్స్‌మి. మీ పెళ్ళాయ్యాక ఒకటి రెండుసార్లు మీ ఇంటికి వచ్చాను. ఇదిగో వీడు మా అబ్బాయి. ఇంజనీరింగ్ వెలిగించి, స్టీలు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. మరి ఆవిడ కామాక్షి" అంటూ సగం నవ్వుతూ మాట్లాడారు శివుడుగారు. "ఆదిత్యా, వీధి తలుపు వెయ్యి. కల్యాణీ కొంచెం టీ పెట్టమ్మా" అన్నారు నాన్న.

నేను వీధి తలుపువేసి, వంటింట్లోకి వెళ్ళాను. అక్కయ్య టీ కలిపి గ్లాసులలో పోసియిస్తే అతిథులకి అందించాను. "వీడు మా అబ్బాయి. ఆదిత్య. తొమ్మిది చదువుతు



యజమాని నౌకరుతో.....

"అరగంట నుండి తలుపు కొడ్తున్నాను వినబడటం లేదా.....? గద్దించాడు.

"... మీరే ఇంటి యజమాని. అర గంట కాకపోతే ఆరు గంటలు కొడ్తూ ఉండండి. అది మీ ఇష్టం...." తాపీగా చెప్పాడా నౌకరు.

—టి. దివ్య
హైదరాబాద్

న్నాడు. మా అమ్మాయి పెద్దది. బి.ఎస్సీ చదువుతోంది. కల్యాణీ ఇలారా" అన్నారు నాన్న.

అక్క వచ్చి నమస్కరించి, లోపలికి వెళ్ళిపోయింది.

నేను అక్కడే గోడకి ఆనుకుని నుంచున్నాను. కామాక్షిగారు పెద్ద జరీ వున్న పట్టుచీర కట్టుకుని, మెడనిండా నగలు పెట్టుకుని గుళ్ళో అమ్మవారిలా ధగధగలాడుతున్నారు. వాళ్ళబ్బాయి చంద్రం కూడా సూటూ, బూటూ వేసుకుని దర్జాగా వున్నారు.

అమ్మ ఎప్పుడు వంటింట్లోకి వెళ్లిందో మరి! అక్కయ్యా అమ్మా గుసగుసలాడుతున్నారు. నేను గ్లాసులు తీసుకెళ్ళి తూము దగ్గర పెట్టాను.

"ఒరే, ఆదిత్యా. ఒక్కసారి ఆ గొడుగు, బ్యాటరీ లైటూ తేరా. దొడ్లో ఆనపపాదుకి కాయవుంది. అక్కా, నువ్వూ వెళ్ళి కోసుకువద్దురుగాని" అంది అమ్మ.

"చుట్టాలు చూశారంటే బాగుండదు. మెల్లిగారా" అంది అక్క.

నాకైతే చాలా భయం వేసింది. చిమ్మ చీకటి. పైన వాన. మధ్య మధ్య మెరుపులూ, హోరు గాలి. "రామ రామ" అనుకోరా భయం వుండదు" అంది అక్క. పైకి గంభీరంగా వున్నా, అక్కా వణుకుతోంది.

ఆ రాత్రి అమ్మ ఆనపకాయ కూర చేసి, పప్పు పులుసు కాచి వేడివేడిగా అతిథులకి వడ్డిస్తే, వాళ్ళు "ఇంత రుచిగల కూర మేం ఎప్పుడూ తినలేద"ంటూ మెచ్చుకున్నారు.

మాది చిన్న ఇల్లు. ఓ వంట గది. ఓ పడక గది. ముందు వరండా, వెనక వరండా. చుట్టూ పెరడు. రాత్రికి అతిథులు మా పడక గది లోనూ, మేం అంతా వంట ఇంటిలోనూ సర్దుకుని పడుకున్నాం. వరండాలు వున్నా, వర్షపు జల్లు వల్ల, అవి పడుకోడానికి యోగ్యంగా లేవు.

రాత్రి చాలా పెద్ద వర్షమే కురిసినట్టువుంది. తెల్లవారినేను పళ్ళు తోముకోడానికి వెనక వరండావైపు వెళ్ళేసరికి, మా పెరడు బీభత్సంగా కనిపించింది. రెండు అరటిచెట్లు నిలువునా కూలిపోయాయి. బాదం కొమ్మలు విరిగి పడి వున్నాయి. చిన్న చిన్న చెట్లంతా నీటి బరువుతో మెడలు వంచి దీనంగా వున్నాయి. పెరడంతా ఆకులతో నీళ్ళతో బీభత్సంగా ఉంది. ఇంకా వర్షం కురుస్తూనే వుంది.

నాన్న వెళ్ళి పాలుతెచ్చారు. అమ్మ కాఫీ కలిపితే, నేను అందరికీ ఇచ్చివచ్చాను. అక్కయ్య అంట్ల గిన్నెలు తోమి గదులు తుడిచింది.

నాన్నగారు లుంగీపైకి కట్టి, నెత్తి మీద తువాలు చుట్టి చేతితో కత్తి పట్టుకుని, వెనకపెరడులోకి యుద్ధంలోకి దిగే వీరుడులా నడిచారు. ఆయన వెనక నేనూ సాయానికి వెళ్ళాను.

"ఒరే, ఆదిత్యా, ఆ బచ్చలాకులు నాలుగు తెంపుకురా, పులుసుకి" అంది అమ్మ మెల్లగా.

నాన్న పడిపోయిన అరటిచెట్లు కొట్టారు. నేను బోదెలు వరండాలోకి ఈడ్చుకుని వచ్చాను. అమ్మ, అక్కయ్య, బోదెలు చీల్చి లోపలి తెల్లని దూట బయటికి తీశారు పాపం, ఓ చెట్టుకి ఓ చిన్నగెల, గెల చివర పువ్వూ వున్నాయి. నాన్న గెల తెగకొట్టి "సీతా యిది ఎందుకైనా పనికి వస్తుందా?" అన్నారు.

అమ్మ ఓ సారి పైకి చూసి "ఆఁ పారేకండి. అలా వరండా మూల పెట్టండి" అంది.

ఈ మా తోటపనంతా మా అతిథులు శివుడుగారూ, వారి అబ్బాయి చంద్రం గుమ్మంలో నుంచుని వింతగా చూస్తున్నారు. కామాక్షిగారికి జ్వరం తగిలిందిట. ఆవిడ మందువేసుకుని పడుకున్నారు.

ఆ రోజు అరటి దూట, పెసరపప్పూ వేసి కూరా, బచ్చలి కూర పులుసూ చేసింది అమ్మ.

అప్పటికే చంద్రంతో నాకు చనువు ఏర్పడింది. అతను నా స్కూలు విషయాలు అడుగుతూ, నా పుస్తకాలు చూశాడు. మేం ఇద్దరం ఓ రెండు గేమ్స్ కేరమ్స్ ఆడాం.

మధ్యాహ్నం భోజనాలయ్యాక, ఇంట్లో అందరం గదిలో కూచుని పేకాట ప్రారంభించాం. పైన వర్షం జోరుగా కురుస్తూనే వుంది. అక్కయ్య ఇచ్చిన వేడి వేడి పాలు త్రాగి కామాక్షి అత్తయ్య కూడా మాతో కూర్చున్నారు. ఆరుగురం అడ్డాట ఆడాం. నేనూ, అక్కయ్యా, చంద్రం ఒక పార్టీ — మమ్మల్ని జూనియర్స్ అన్నారు శివుడు మావయ్య. ఆయనా, నాన్నా, అమ్మా ఒక పార్టీ — సీనియర్స్. ఈ ఆటలో చాలా మజా వచ్చింది. అమ్మా, అక్కా చాలాసేపు ముభావంగా వున్నా, తర్వాత తర్వాత ఆటల సందడిలో మాటలు కలిపి మాట్లాడారు. కామాక్షి అత్తయ్యగారు మధ్య మధ్యలో "అదేమిటె కల్యాణీ, అంత సిగ్గుపడతావ్. భయపడకు. మాట్లాడాలి. అడ్డు అను. మీ మావయ్య షరతు అంటారు. మా చంద్రం వున్నాడు. ఓ కాపు కాస్తాడు. అంటూ అక్కనీ, "ఒరే చంద్రం, నీ దగ్గిర మనేలా వుంది కదూ! మరి అలా సుద్దపప్పులా

కూర్చుంటావేం? వూ॰ అద్దు అను" అంటూ వాళ్ళబ్బాయిని, ముక్కలు చూడకుండానే వూదర గొట్టేశారు. మా అమ్మాయి ఎక్కువ మాట్లాడదు. అందులో కొత్త వాళ్ళు వుంటే నోట్లోంచి మాటరాదు" అంది అమ్మ, అక్కని వెనకవేసుకుంటూ. "అవునవును చూస్తునే వున్నాను. మీరు అదృష్టవంతులు వదిన గారూ. పిల్ల బుద్ధి మంతురాలు. ఏ ఇంటికి కోడలుగా వెళుతుందో! వాళ్ళు అదృష్టవంతులు" అంది కామాక్షి అత్తయ్య, అక్కవైపు చాలా ఆదరంగా చూస్తూ.

"దేనికైనా పెట్టిపుట్టాలోయ్. కామాక్షి ఎవరో మహానుభావుడు బంగారు పూలతో కల్యాణి కోసం పూజ చేసి వుండాలి" అన్నారు మావయ్య. అమ్మా, నాన్నల ముఖాలలో ఎంతో సంతోషం, కించిత్తు గర్వం తొంగిచూశాయి.

చంద్రం ఓరకంట అక్కని చూడటం, అక్క క్షణంలో సగంసేపు అతనిని చూసి తలతిప్పుకోడం నాకంట పడింది. వారిద్దరినీ అలా చూస్తూ వుంటే నాలో ఏవేవో ఆలోచనలు వచ్చాయి.

రాత్రి మళ్ళీ వర్షం ఎక్కువైంది. "అబ్బ ఈ వానలు ఓసారి పట్టుకుంటే వదలవు జిడ్డులా" అన్నారు నాన్న, సాయంత్రం అక్కయిచ్చిన టీ తాగుతూ అందరం కూర్చున్నప్పుడు. "నాకు మాత్రం ఈ వానలు చాలా బాగున్నాయి" అన్నాను, చంద్రంతో చైనీస్ చక్కర్స్ ఆడుతూ.

"ఎందుకు బాగుండవు రానీకు? హాయిగా స్కూలు ఎగ్గొట్టి, యింట్లో కూచోవచ్చుగా!" అంది అమ్మ.

ఒక వైపు నాన్న, మామయ్య చిన్నప్పటి వాళ్ళ స్కూలు కబుర్లూ, స్నేహితుల గురించి మాట్లాడుకుంటున్నారు. దూరంగా అక్క స్త్రీల వార పత్రిక చదువుతోంది.

అమ్మా, అత్తయ్యగారూ మాకు దగ్గిరగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయ్. "వదిన గారూ, ఈ వర్షాలలో బయలు దేరారేమిటి?" అంది అమ్మ.

"ఏంచెయ్యమంటారు వదినా ! పెళ్ళివారు ముహూర్తం పెట్టి అమ్మాయిని చూసుకోడానికి రమ్మని ఒకటే తొందర. నెలరోజుల కిందట టిక్కెట్లు బుక్ చేశారు మీ అన్నగారు"

"మావూరు అమ్మాయేనా? ఎవరి పిల్ల?" అంది అమ్మ ఉత్సుకతతో. డాక్టర్ ధనేశ్వర్రావ్ గారి అమ్మాయి. బి.కాం చదివింది. నిన్న వారింట్లోనే దిగి అమ్మాయిని చూశాం. రాత్రి రైలుకి మా టికెట్లు బుక్ అయిపోయాయి. తీరా స్టేషన్‌కి వెళితే రైలు ఎనిమిది గంటలు లేటు అన్నారు. మరి అప్పటికైనా వస్తుందో లేదో తెలియదు. ముందు రైలు పట్టాలు తప్పిందిట. అప్పటికే గాలి, వాన ప్రారంభమయ్యాయి.



రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు ధనశేఖర్. ఆ మరునాడే విమాన ప్రయాణం చేయవలసి వచ్చింది. విమానాశ్రయంలో బరువు తూచే యంత్రంలో నాణెం వేశాడు. కార్డు వెనుకాల ... "ఈ మధ్య మీరు పెట్టిన పెట్టుబడి మంచి లాభాన్ని తీసుకురానుంది. అని ఉంది.

—ఆత్మారామ్
చిట్యాల

ఎక్కడికి వెళ్లాలో తెలియలేదు. డాక్టరుగారు డ్రైవర్ నిచ్చి కారులో స్టేషన్‌కి దిగబెట్టారు. కారు దిగి, డ్రైవర్‌ని వెళ్లిపోమన్నాం. ఏం చెయ్యాలో తెలియని స్థితిలో మీరు ఈ వూళ్ళో ఉంటున్న సంగతి మా ఆయనకి గుర్తు వచ్చింది. పూర్వం మీ ఇంటికి వచ్చి ఉండబట్టి ఇల్లు సులువుగా కనుక్కుని మీ ఇంటి మీద పడ్డాం. ఇదిగో ఇలా మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాం" అంది కామాక్షి అత్తయ్య. ఇబ్బంది ఏముందిలెండి. ఇంతకీ డాక్టర్‌గారి అమ్మాయి మీకు నచ్చిందా? "ఏదీమేం ఇంకా ఏమీ అనుకోలేదు. పిల్లసామాన్యంగా ఉంది. కల్యాణిలా లేదు. మీ అమ్మాయిని చిదిమి దీపం పెట్టుకోవచ్చును" అంది నవ్వుతూ అత్తయ్య.

దూరంగా కూర్చున్న అక్క కూడా ఈ మాటలు వింటున్నట్టు ఉంది. దాని బుగ్గలు రెండు ఎరుపెక్కాయి. ఆటమాని చంద్రం అక్కనే చూస్తున్నాడు.

"దానిదేం లెండి. మా కళ్యాణి లాంటి పిల్లలు బోలెడంతమంది ఉంటారు" అంది అమ్మ. గర్వాన్ని దాచుకుంటూ.

"చీకటి పడుతోంది రాత్రి వంటచెయ్యాలి" అంటూ అమ్మలేచింది వెనకే అక్క లేచింది.

"నాకు వెంటనే ఆదిత్యా ఓసారి యిలారా" అంటూ పిలుపు. "ఒరే రాత్రికి అదరువు ఏమీ కనిపించటంలేదు. చైతన్యా వాళ్ల అమ్మగారి నడిగి ఓ పాతిక అప్పడాలు తెచ్చిపెట్టు" అంది.

"అదుగో ఆ గుడ్డ సంచీ పట్టుకువెళ్ళు. అందులో తే. ఇంటికొచ్చిన చుట్టాలకి తెలిస్తే బాగుండదు" అంది అక్క.

గొడుగు వేసుకుని చైతన్య ఇంటికి వెళ్ళి, అప్పడాలు తెచ్చి అమ్మకి ఇచ్చాను.

అమ్మరాత్రి చేసిన అల్లం పచ్చడీ అప్పడాలూ వేసుకుని ఎంతో సంతోషించారు అతిథులు.

"నువ్వు చాలా అదృష్టవంతుడివిరా రామం. మా చెల్లెమ్మ చేతి వంట అమృతం అనుకో" అన్నారు మామయ్య.

"ఈ అప్పడాలు చాలా బాగున్నాయమ్మా. మన వూళ్ళో ఇవి దొరకవా? నువ్వెప్పుడూ ఇలాంటి అప్పడాలు కొనవు" అన్నాడు చంద్రం. "అవునండీ వదినగారూ ఈ అప్పడాలు చాలా బాగున్నాయి. మావూరికి కొని తీసికెళతాం" అన్నారు అత్తయ్య.

మర్నాడు వాన వెలిసింది. "రామం, మేంఅలా ఓసారి ఊళ్లో షాపులు చూసి టికెట్లు తెచ్చుకొని వస్తాం" అంటూ మామయ్య, అత్తయ్య చంద్రాన్ని తీసుకుని బయటికి వెళ్లారు.

మధ్యాహ్నం తిరిగి వచ్చారు. చేతిలో చీరల పాకెట్టులు, మా వూళ్ళో అమ్మే మామిడి తాండ్ర, జీడిపప్పులు వగైరా అన్నీ తెచ్చారు.

కామాక్షి అత్తయ్య చీరలు విప్పి అమ్మకీ, అక్కకీ చూపించారు. అవి ఎంతో బాగున్నాయి. "మీ వూళ్ళో మా వూళ్ళో కంటె చీరలు ఎంతో చవక. ఊరికే చూద్దామని వెళ్ళి ఇన్ని కొనుక్కొచ్చాం" అంది అత్తయ్య.

"ఆవిడ మాటలు నమ్మకు సీతమ్మా. మీ వదిన గారికి ఎన్ని చీరలు ఉన్నా అంతే ! కొంటూనే ఉంటుంది.

ఒక్కసారి ఆవిడ బీరువా తెరచి చూడు కల్యాణి. తలుపు తెరవగానే నీమీదా, నా మీదా కట్టలు తెంచుకున్న నీటి వరదలా మీద పడతాయి చీరల దొంతరలు" అన్నారు.

"మీరెప్పుడూ ఇంతే" అంటూ అత్తయ్య బుంగమూతి పెట్టి తిరిగి నవ్వేశారు.

మా కుటుంబ సభ్యులం ప్రేక్షకుల్లా నిలబడి పోయాం.

ఆ సాయంత్రం అతిథులు వెళ్లిపోయారు. వారు వెళ్లగానే ఇల్లు చిన్నబోయింది. సాయంత్రం అక్కయ్య స్నేహితురాలింటికి వెళ్ళినపుడు అమ్మ, నాన్న వంటింట్లో కాఫీ త్రాగుతూ మాట్లాడుకోడం వినిపించింది.

"మీ స్నేహితుడికీ, భార్యకీ మన కల్యాణి బాగా నచ్చినట్టుంది. మనమ్మాయిని వారు చేసుకుంటారేమో అడగవలసింది" అంది అమ్మ.

"అంత ఆశలకి పోకు సీతా, వాడెక్కడ? మనమెక్కడ?" అన్నారు నాన్న.

"అంతేనంటారా?"

"వాడి సంగతి నాకు బాగా తెలుసు. పట్టి స్వార్థపరుడు. అతని అవసరం గడుపుకోడం కోసం ఏ ఎండకా గొడుగు పట్టేగకం? మనల్ని ఉబ్బేయడానికి మనమ్మాయిని అలా పొగిడారు" అన్నారు నాన్న అనుభవసారాన్ని కాచివడపోసిన వేదాంతిలా.

అయినా అమ్మలో ఆశ ఉండిపోయినట్టు ఉంది. చెప్పక పోయినా అక్కలో కూడా ఆశ వుందేమో. ఇద్దరూ రోజూ పోస్ట్‌కోసం ఎదురు చూసేవారు. అయితే మా ఇంటికి అతిథుల దగ్గిర నించి ఒక్క ఉత్తరం కూడా రాలేదు. తుపానులా వచ్చారు వెళ్ళారు అంతే !